# పెన్ పవర్


తెలంగాణ రౌండప్

బుధవారం | 2 జూలై 2025 | పేజీలు 8


## హైదరాబాద్ మణికొండలో అక్రమ నిర్మాణాల కూల్చివేత..

హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ మణికొండలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు టౌన్ ప్లానింగ్ అధికారులు. అక్రమ నిర్మాణాలపై స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం ( జులై 1 ) కూల్చివేతలు చేపట్టారు.

- మిగతా 3లో...




## ప్రముఖ ఇంద్రజాలికుడు పట్టాభిరామ్ లేని లోటు పూడ్చలేనిది



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, మానసిక వైద్యుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్ మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఇంద్రజాల విద్య ద్వారా మూఢ నమ్మకాల నుంచి ప్రజలను జాగృతం చేయడంలో పట్టాభిరామ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. తన ఇంద్రజాల విద్య ద్వారా అనేక ప్రజాపయోగ కార్యక్రమాలు చేసిన పట్టాభిరామ్ లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. పట్టాభిరామ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కాగా, తెలుగు ప్రజలకు ఎంతో సుపరిచితులైన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బీవీ పట్టాభి రామ్ గుండెపోటుతో కన్నుమూశారు. జూన్ 30న రాత్రి 9 గంటల 45 నిమిషాలకు ఆయన చనిపోయినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. కేవలం వ్యక్తిత్వ వికాస నిపుణుడిగానే కాకుండా హిప్నటిజంలో కూడా ఆయన దిట్ట. మెజీషియన్?గా కూడా సుపరిచితులు. మోటివేషనల్ స్పీకర్?గా ప్రసంగాలు మాత్రమే కాదు వ్యక్తిత్వ వికాసాన్ని మెరుగుపరుచుకునేందుకు

-3 లో



# బాల కార్మికులు లేని జిల్లాగా... మేడ్చల్ జిల్లాను చూడాలి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను అధ్యక్షతన ఆపరేషన్ ముస్కాన్-11 సమీక్ష ..



ఆపరేషన్ ముస్కాన్-11 సమావేశంలో కలెక్టర్ మను..

- మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్‌కి హాజరైన కలెక్టర్..
- సమావేశంలో మేడ్చల్ జిల్లా బాలల కమిషన్ సభ్యురాలు సరిత పాల్గొన్నారు..
- జిల్లాలో బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులపై చట్టపరమైన చర్యలు..

-2 లో

## భూమి రిజిస్ట్రేషన్ కోసం రూ. 10,000 లంచం
### ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన తహసీల్దార్

- రంగారెడ్డి జిల్లాలో వెలుగుచూసిన లంచం వ్యవహారం
- తహసీల్దార్, అటెండర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం డిమాండ్ చేసిన అధికారులు
- బాధితుడి నుంచి రూ.10,000 తీసుకుంటుండగా అరెస్ట్
- తలకొండపల్లి తహసీల్దార్ నాగార్జున, అటెండర్ యాదగిరిపై కేసు నమోదు
- లంచం అడిగితే 1064కి కాల్ చేయాలని ప్రజలకు ఏసీబీ సూచన



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అవినీతిపై ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా రంగారెడ్డి జిల్లాలో ఒక తహసీల్దార్, అటెండర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. భూమి రిజిస్ట్రేషన్ కోసం రైతు నుంచి లంచం డిమాండ్ చేయడమే కాకుండా, ఆ మొత్తాన్ని స్వీకరిస్తుండగా వారిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

-3 లో

## పాశమైలారం పేలుడు ఘటన .. 36కు పెరిగిన మరణాలు

●ఆచూకీ లేని 13 మంది కార్మికులు ●క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమం
●కొనసాగుతున్న సహాయక చర్యలు●డీఎన్ఏ పరీక్షలకు బంధువుల రక్తనమూనాల సేకరణ





హైదరాబాద్ పెన్ పవర్: మొన్నటి వరకు అదొక ఔషధ పరిశ్రమ. ఇప్పుడది శవాల దిబ్బ. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. కాలిపోయి బొగ్గుగా మారినవి కొన్నయితే... శిథిలాల మధ్య ఇరుక్కొని మాంసపు ముద్దలుగా మారినవి మరికొన్ని. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన పేలుడులో 19 మంది కార్మికులు మృతి చెందారని, ఐదుగురి ఆచూకీ తెలియడంలేదని అధికారులు తెలిపిన విషయం తెలిసిందే. కానీ, సహాయక సిబ్బంది మంగళవారం మరో 17 మృతదేహాలను వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య 36కు చేరింది. గాయపడిన 34 మంది నగర శివార్లలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగతా 60 మంది కార్మికుల ఆచూకీ లభించిందని,

-3 లో




# బాల కార్మికులు లేని జిల్లాగా...
# మేడ్చల్ జిల్లాను చూడాలి




ఆపరేషన్ ముస్కాన్-11 సమావేశంలో కలెక్టర్ మను..

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను అధ్యక్షతన ఆపరేషన్ ముస్కాన్-11 సమీక్ష..

- మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్‌కి హాజరైన కలెక్టర్..
- సమావేశంలో మేడ్చల్ జిల్లా బాలల కమిషన్ సభ్యురాలు సరిత పాల్గొన్నారు..
- జిల్లాలో బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులపై చట్టపరమైన చర్యలు..



**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 1:** పిల్లల ముఖాల్లో చిరునవ్వులే కాదు, వారికి బంగారు భవిష్యత్తు అందించే వరకు వారిపట్ల బాధ్యతగా వ్యవహారించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు.. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆపరేషన్ ముస్కాన్-11 సమీక్షా సమావేశం నిర్వహించారు.. ఆపరేషన్ ముస్కాన్-11లో భాగంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, వివిధ జిల్లా అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం బాల కార్మికుల నిర్మూలనపై కూలంకషంగా ప్రసంగించారు.. మేడ్చల్ జిల్లాను బాల కార్మికులు లేని జిల్లాగా ఏర్పాటు చేసుకోవాలని, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు చందన పేర్కొన్నారు.. జిల్లా బాలల కమిషన్ సభ్యురాలు సరిత మాట్లాడుతూ, జిల్లాలోని బాల కార్మికులుగా పనిలో పెట్టుకున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వివిధ జిల్లా శాఖల అధికారులకు సూచించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో పని చేస్తున్న బాల కార్మికులు లేని పారిశ్రామిక వాడలుగా ఉండాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. చైల్డ్ లేబర్, రవాణకు గురవుతున్నవారు, అనాథ బాల, బాలికలు ఉన్నారని, జిల్లాలో పది సంరక్షణ కేంద్రాలు ఉన్నాయని గుర్తించిన వారి వివరాలు మిషన్ వాత్సల్య పోర్టల్ లో అప్లోడ్ చేయాలని, ఆపరేషన్ ముస్కాన్‌లో జిల్లాలోని జవహర్ నగర్, సూరారం లాంటి ప్రాంతాలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు.. ఈ సమన్వయ సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ రాజారెడ్డి మాట్లాడుతూ, జూలై నెలలో రక్షించిన పిల్లల కోసం 24/7 అందుబాటులో ఉంటామని తెలియజేశారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ, బాల కార్మికులు, భిక్షాటన చేసే పిల్లలు, అనాథ పిల్లలు, వదిలేయబడిన పిల్లలు ను రక్షించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచి వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని అన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చి పారిశ్రామిక వాడల్లో, ఇతరత్రా పని ప్రాంతాల్లో బాల కార్మికుల కనిపిస్తే




వెంటనే 1098, కానీ 100 కాల్ చేసి సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు..ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు లేబర్ డిపార్ట్మెంట్, డిఎంహెచ్ఓ ఉమా గౌరీ, పంచాయతి రాజ్ అధికారి, డీఈవో విజయ్ కుమారి, పోలీస్ కమిషనరేట్ సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పోలీస్ అధికారులు, మల్కాజిగిరి ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెకర్, ఎక్సైజ్ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు రామ్మోహన్, బిఆర్‌బి కోఆర్డినేటర్ తిరుమల దేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్, వారి సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

## ప్రముఖ ఇంద్రజాలికుడు పట్టాభిరామ్ లేని లోటు పూడ్చలేనిది

- మొదటి పేజి తరువాయి

ఏం చేయాలనే అంశంపై ఆయన పలు పుస్తకాలు కూడా రాశారు. వేల మందిని.. మరీ ముఖ్యంగా విద్యార్థులను తన ప్రసంగాలతో, పుస్తకాలతో మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు పట్టాభి రామ్ కృషి చేశారు. దాదాపు 20 సంవత్సరాలకు పైగా మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా గౌరవప్రదంగా కొనసాగారు. ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని ఖైరతాబాద్ లోని ఆయన నివాసంలో ఉంచనున్నారు. జులై 2న మధ్యాహ్నం 3 గంటల సమయంలో మహా ప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. వ్యక్తిత్వ వికాస రంగంలో ఆయన సేవలకు గానూ ఎన్నో అవార్డులు, రివార్డులను ఆయన సొంతం చేసుకున్నారు.

## పొట్ట కూటి కోసం వచ్చి కార్మికులు ప్రాణాలు కోల్పోవడం బాధకరం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటన చాలా దురదృష్టకరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం (జూలై 1) ఆయన ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. సిగాచి పరిశ్రమ ఫార్మా కంపెనీలకు రా మెటీరియల్ సప్లై చేస్తుందని తెలిపారు. ఘటన స్థలంలో కొన్ని మృతదేహాలు ఇప్పటికే లభించాయని.. ఇంకా 11 మంది ఆచూకీ తెలియడం లేదన్నారు. గతంలో కూడా ఓ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ వల్ల 11 మంది చనిపోయారని.. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం ప్రభుత్వం అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

పొట్ట కూటి కోసం వచ్చి కార్మికులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని.. ప్రమాద బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల్లో తనిఖీలు లంచాల కోసం జరుగుతున్నాయా.. నామ్ కే వాస్తే ప్రకారం జరుగుతున్నాయా అని ప్రభుత్వం ఒకసారి ఆలోచించాలని హితవు పలికారు. సిగాచి యాజమానానికి మరో 3 పరిశ్రమలు ఉన్నాయని... ఇప్పటికైనా అన్నింటిని తనిఖీ చేయాలని చెప్పారు. మృతుల జాబితా వచ్చిన తరువాత ఆయా రాష్ట్రాల వారికి మా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మిస్ అయిన వారి ఆచూకీ ప్రభుత్వం త్వరగా తెలుసుకోవాలన్నారు. శిథిలాల కింద మృతదేహాల గుర్తింపు కోసం పోలీస్ డాగ్స్?ని ఉపయోగించాలన్నారు. పరిశ్రమల ప్రాంతంలో కచ్చితంగా అంబులెన్స్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చనిపోయిన కుటుంబాల సభ్యులు సొంత రాష్ట్రాలకు వెళ్లిపోతామంటే సహకరిస్తామని.. కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# పాశమైలారం పేలుడు ఘటన .. 36కు పెరిగిన మరణాలు

- మొదటి పేజి తరువాయి

మరో 13 మంది ఆచూకీ తెలియడంలేదని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 143 మంది పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. భవనం శిథిలాలను పూర్తిగా తొలగిస్తేనే గల్లంతైన వారి వివరాలు లభిస్తాయి. మరోవైపు చనిపోయిన వారిని గుర్తించడానికి వారి బంధువులకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి గుర్తించే ప్రక్రియ చేపట్టారు.

**కనిపించని భవనం ఆనవాళ్లు**

పరిశ్రమ పూర్తిగా కుప్పకూలడంతో ఘటన జరిగిన 36 గంటల తర్వాత కూడా మొత్తం ఎందరు చనిపోయారన్న దానిపై స్పష్టత రాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సోమవారం ఉదయం ఘటన జరిగిన వెంటనే తొలుత క్షతగాత్రులను, మంటల్లో చిక్కుకొన్న వారిని రక్షించేందుకు, మృతదేహాలను వెలికి తీసేందుకు ప్రాధాన్యమిచ్చిన సహాయక సిబ్బంది నెమ్మదిగా శిథిలాలను తొలగించడం ప్రారంభించారు. మంగళవారం ఉదయానికి పేలుడు జరిగిన ప్రాంతం వరకు జేసీబీలను వెళ్లగలిగేలా చేయగలిగారు.

ప్రధాన ద్వారం నుంచి దాదాపు 50 మీటర్ల దూరంలో పరిశ్రమ భవనముంది. అందులోని ఎడమవైపు గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఔషధాన్ని శుద్ధి చేసే స్ప్రేయర్ డ్రయ్యర్ ఉంది. దానికి వెనుకవైపు ముడి పదార్థాన్ని పంపించే అల్యూమినియం పైపులు, ఎయిర్ హ్యాండిల్ యూనిట్లు ఉన్నాయి. సరిగ్గా డ్రయ్యర్ పైఅంతస్తులో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎష్యూరెన్స్ విభాగాలున్నాయి. దానికి ఎడమవైపు గ్రౌండ్‌ఫ్లోర్, దాని పైఅంతస్తులో పరిపాలన, ఎకౌంట్స్ విభాగాలున్నాయి. డ్రయ్యర్ పేలుడు తీవ్రతకు శ్లాబ్ మొత్తం కుప్పకూలింది. అక్కడ ఒక అంతస్తు ఉండేదని చెప్పినా నమ్మలేని పరిస్థితి.

**లోనికి వెళ్లాలంటే భయం**

పేలుడు జరిగినప్పుడు డ్రయ్యర్ వద్ద సుమారు 50 మంది, దాని పైఅంతస్తులో 20 మంది వరకున్నారని ప్రాథమిక సమాచారం. పేలుడు తీవ్రతకు భవనమంతా కదిలిపోవడంతో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని శిథిలాలను తొలగించి... లోనికి అడుగు పెట్టడానికి సహాయక సిబ్బంది జంకుతున్నారు. లోనికి వెళ్లగానే పైనున్న స్లాబ్ కూలిపోతుందన్న భయమే ఇందుకు కారణం. దాంతో మంగళవారం ఉదయం సహాయ చర్యలను నిలిపివేశారు. సాయంత్రం మళ్లీ మొదలైనా చురుకుగా సాగడంలేదు. ప్రత్యామ్నాయంగా భారీ యంత్రాలను తీసుకొచ్చి... శిథిలాలను తొలగించాలని అధికారులు ఆలోచిస్తున్నారు.

సిగాచీ పరిశ్రమలో శిథిలాలను తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బంది. వీటి కింద మరిన్ని మృతదేహాలు ఉన్నట్టు అనుమానిస్తున్నారు

**50 మీటర్ల దూరం నుంచి ఎగిరిపడి... తన కారువద్దే..**

పేలుడు తీవ్రతకు 50 మీటర్ల దూరంలో ఉన్న భద్రతా సిబ్బంది కార్యాలయం కూడా కాలిపోయింది. దానిపక్కనే ప్రధాన ద్వారం వద్ద నిలిపిన సంస్థ జనరల్ మేనేజర్ ఇలంగోవన్ కారు ధ్వంసమైంది. ఆయన క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం నుంచి మెట్లు దిగుతుండగా పేలుడు జరగడంతో... ఎగిరొచ్చి తన కారు వద్దే పడిపోయి ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఒక అగ్నిగోళం ఎగిరి వచ్చినట్లుగా కనిపించిందని చుట్టుపక్కల వారు తెలిపారు.

**ఐదుగురి పరిస్థితి విషమం**

ప్రమాదంలో గాయపడిన వారిలో తొమ్మిది మంది కార్మికులు పటాన్‌చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు రాజనర్సింహ, పొంగులేటి, వివేక్, శ్రీధర్‌బాబు పరామర్శించారు. వీరి వెంట డీజీపీ జితేందర్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినాచోంగ్తూ ఉన్నారు. మరోవైపు పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి 36 మృతదేహాలను తరలించగా... ఉస్మానియా నుంచి వచ్చిన ఫోరెన్సిక్ బృందం వారు 30 మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఇక్కడ మృతదేహాలను నిల్వ ఉంచేందుకు ఫ్రీజర్లు, స్థలం లేకపోవడంతో పక్కనే కొత్తగా నిర్మించిన మల్టీ స్పెషాలిటీ భవనంలో వైద్యారోగ్య శాఖ పంపించిన ఫ్రీజర్లలో భద్రపరిచారు. మరో ఆరింటికి పోస్టుమార్టం జరగాల్సి ఉంది.

11 మంది మృతుల కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.11 లక్షలు, 34 మంది క్షతగాత్రులకు రూ.17 లక్షల నగదును ఆర్డీవో రవీందర్ అందించారు.

కార్మికుల కుటుంబాలకు చెందిన యశ్వంత్ అనే వ్యక్తి బీడీఎల్ భానూరు ఠాణాలో ఫిర్యాదు చేయడంతో సిగాచీ పరిశ్రమ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## భూమి రిజిస్ట్రేషన్ కోసం రూ. 10,000 లంచం: ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన తహసీల్దార్

- మొదటి పేజి తరువాయి

రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలంలో ఒక రైతు తన కుటుంబ సభ్యుల పేరిట 22 గుంటల వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. అయితే, ఈ పనిని పూర్తి చేయడానికి తలకొండపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న బి. నాగార్జున, అదే కార్యాలయంలోని అటెండర్ యాదగిరి కలిసి బాధితుడి నుంచి రూ.10,000 లంచం డిమాండ్ చేశారు.

అధికారుల తీరుతో విసిగిపోయిన బాధితుడు, నేరుగా ఏసీబీ అధికారులను సంప్రదించి తన గోడు వెళ్లబోసుకున్నారు. అతని ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. ముందుగా అనుకున్న ప్రకారం, మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు రూ.10,000 ఇస్తుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, తహసీల్దార్ నాగార్జున, అటెండర్ యాదగిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**లంచం అడిగితే ఫిర్యాదు చేయండి: ఏసీబీ**

ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం అడిగినా, వేధించినా భయపడకుండా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాధితులు తమ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB) లేదా అధికారిక వెబ్‌సైట్ (https://acb.telangana.gov.in) ద్వారా కూడా తమను సంప్రదించవచ్చని అధికారులు వివరించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

## హైదరాబాద్ మణికొండలో అక్రమ నిర్మాణాల కూల్చివేత..

- మొదటి పేజి తరువాయి

ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనిలో రౌహౌస్ లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలపై ఫిర్యాదులు అందటంతో కూల్చివెతలు చేపట్టారు అధికారులు. టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టిన అధికారులు మరో నిర్మాణాన్ని కూల్చివేసేందుకు వెళ్లగా అందులో నివాసం ఉంటున్నామని.. ఒకరోజు సమయం ఇవ్వాలని కోరారు ఆక్రమణదారులు. దీంతో బుధవారం ( జులై 2 ) తెల్లవారుజామున ఆరు గంటల సమయానికి ఖాళీ చేయకపోతే ఎట్టి పరిస్థితిలో తొలగిస్తామని హెచ్చరించారు అధికారులు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే తమ దృష్టికి తీసుకురావాలని.. అక్రమంగా నిర్మాణాలను గుర్తించి నెలమట్టం చేస్తామని తెలిపారు అధికారులు.

## మేడ్చల్ ఫార్మా కంపెనీలో బాయిలర్ పేలుడు.. కార్మికుడికి తీవ్ర గాయాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని పారిశ్రామికవాడలో మంగళవారం నాడు ఒక ఫార్మా కంపెనీలో భారీ ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో బాయిలర్ పేలి ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. మేడ్చల్ పారిశ్రామికవాడలోని ఆల్కలైడ్స్ బయో యాక్టివ్స్ ఫార్మా కంపెనీలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.పరిశ్రమలో కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో బాయిలర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయింది. ఆ సమయంలో సమీపంలో విధుల్లో ఉన్న శ్రీనివాస్ రెడ్డి అనే కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన తోటి సిబ్బంది, యాజమాన్యం అతడిని హుటాహుటిన చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఒక కార్పోరేట్ ఆసుపత్రికి తరలించారు.

## ఎక్కువ గంటలు పని చేయొద్దు: ఇన్ఫోసిస్ కీలక నిర్ణయం

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోని ప్రముఖ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తమ ఉద్యోగుల ఆరోగ్యం, వర్క్–లైఫ్ బ్యాలెన్స్‌కు సంబంధించి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. నిర్దేశిత పనివేళలు ముగిసిన తర్వాత అదనంగా పని చేయవద్దని, ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఉద్యోగులకు స్పష్టమైన సూచనలు జారీ చేస్తోంది. ఈ పరిణామం, ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి గతంలో చేసిన “వారానికి 70 గంటల పని” వ్యాఖ్యలకు పూర్తి విరుద్ధంగా ఉండటంతో ఐటీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

**అదనపు పని వద్దంటూ వ్యక్తిగత మెయిల్స్**

ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లో దాదాపు 3.23 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 2023 నవంబర్ నుంచి కంపెనీ హైబ్రిడ్ వర్క్ మోడల్‌ను అమలు చేస్తోంది. దీని ప్రకారం, ఉద్యోగులు నెలలో కనీసం 10 రోజుల పాటు కార్యాలయానికి వచ్చి పని చేయాల్సి ఉంటుంది. అయితే, చాలామంది ఉద్యోగులు అదనపు పని గంటలు, సరైన నిద్ర లేకపోవడం, సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాలతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు సంస్థ హెచ్‌ఆర్ విభాగం గుర్తించింది. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని గమనించి, వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టింది.

ఇందులో భాగంగా, ఉద్యోగుల పనివేళలను నిశితంగా గమనిస్తోంది. వారంలో ఐదు రోజుల చొప్పున, రోజుకు సగటున 9.15 గంటలు పనిచేయాల్సి ఉండగా, అంతకు మించి ఎక్కువ సమయం పనిచేస్తున్న వారిని గుర్తిస్తున్నారు. ముఖ్యంగా రిమోట్‌గా పనిచేస్తున్న ఉద్యోగులకు, వారు ఏ రోజు ఎన్ని గంటలు పనిచేశారో వివరిస్తూ వ్యక్తిగతంగా ఈ–మెయిల్స్ పంపిస్తున్నారు. పనివేళలు ముగిసిన వెంటనే విశ్రాంతి తీసుకోవాలని, పని మధ్యలో విరామం తప్పనిసరి అని ఆ మెయిల్స్‌లో సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప, పని గంటల తర్వాత ఆఫీస్ పనులకు దూరంగా ఉండాలని స్పష్టం చేస్తున్నారు.

**నారాయణమూర్తి అభిప్రాయానికి భిన్నంగా**

కొంతకాలం క్రితం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి, దేశ యువత వారానికి 70 గంటలు పనిచేయాలని వ్యాఖ్యానించి పెద్ద దుమారానికి తెరలేపారు. ఆయన అభిప్రాయంపై తీవ్ర విమర్శలు వ్యక్తమైనప్పటికీ, ఆయన తన మాటలను సమర్థించుకున్నారు. అంతేకాకుండా, 1986లో ప్రవేశపెట్టిన ఐదు రోజుల పని విధానాన్ని కూడా ఆయన విమర్శించారు. వర్క్–లైఫ్ బ్యాలెన్స్‌కు తాను పూర్తిగా వ్యతిరేకినని కుండబద్దలు కొట్టారు. ఈ నేపథ్యంలో, ఇన్ఫోసిస్ యాజమాన్యం తమ ఉద్యోగుల వ్యక్తిగత ఆరోగ్యం, వర్క్–లైఫ్ బ్యాలెన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఒక్క రాత్రి వర్షం.. రూ.50 కోట్లు గంగపాలు.. షుగర్ మిల్లును ముంచెత్తిన వరద.. పంచదార వర్షార్పణం



**హైదరాబాద్ పెన్ పవర్:**హర్యానాలో కురుస్తున్న భారీ వర్షాలకు 50 కోట్ల రూపాయల విలువైన పంచదార నీళ్ల పాలైంది. హర్యానాలోని యమునా నగర్?లో ఉన్న సరస్వతి షుగర్ మిల్ ఆసియాలోనే అతి పెద్దది. హర్యానాలో భారీ వర్షాల కారణంగా పోటెత్తిన వరద ఈ షుగర్ మిల్?ను ముంచెత్తింది. ఎగుమతికి సిద్ధంగా ఉన్న పంచదార బస్తాలు నీళ్లలో నానిపోయాయి. ఆ వరద నీళ్లలో పంచదార కరిగిపోయి కనిపించింది. యమునా నగర్ గిడ్డంగిలో 2 లక్షల 20 వేల క్వింటాళ్ల పంచదార స్టోర్ చేసి ఉంది. ఈ పంచదార విలువ సుమారు 97 కోట్లు. వరదల కారణంగా సుమారు 40 శాతం పంచదార గంగపాలైంది. 50 నుంచి 60 కోట్ల మేర నష్టం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వరద నీటితో పాటు సమీపంలోని డ్రైన్ పొంగి పొర్లడంతో వరద నీళ్లు షుగర్ మిల్?లోకి ఉప్పెనలా వచ్చాయని, పంచదార బస్తాలను ముంచెత్తాయని అధికారులు తెలిపారు.

సరస్వతి షుగర్ మిల్ జనరల్ మేనేజర్ రాజీవ్ మిశ్రా ఈ ఘటనపై స్పందిస్తూ.. మున్సిపల్ కార్పొరేషన్ డ్రైనేజ్ వాటర్ గిడ్డంగి కుడి వైపు నుంచి పోతుంటాయని, ఆ డ్రైనేజ్ బ్లాక్ అయి ఆ నీళ్లంతా వరద నీళ్లతో కలిసి షుగర్ మిల్?ను, గిడ్డంగిని ముంచెత్తాయని చెప్పారు. సోమవారం రాత్రి హర్యానాలో కుండపోత వర్షం కురిసింది. వరద నీళ్లు ముంచెత్తాయి. ఎంత భారీ వర్షాలు కురిసినా, వరదలు పోటెత్తినా ఈ షుగర్ మిల్?లోకి ఎప్పుడూ నీళ్లు పోయినా సందర్భాలు లేవని, ఫస్ట్ టైం ఇలా జరిగిందని రాజీవ్ మిశ్రా చెప్పారు. షుగర్ మిల్, గిడ్డంగిలో ఉన్న నీళ్లను అధికారులు భారీ మోటార్ల సాయంతో బయటకు తోడిపోయిస్తున్నారు.

ఉత్తర భారతంలో కొద్ది రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జార?ండ్, హర్యానాలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. వీటితో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, రాజస్థాన్?కు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) రెడ్ అలర్ట్ ప్రకటించింది. జులై 2 నుంచి 5 వరకు ఈ రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. వర్షాలతో జార?ండ్ ఆగమాగం అవుతోంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి.

# 657 కిలోమీటర్ల దూరం.. 335 గ్రామాల గుండా ప్రయాణం.. రాజస్థాన్‌కు గేమ్ ఛేంజర్‌గా బుల్లెట్ ట్రైన్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే దేశంలో మెరుపు వేగంతో దూసుకెళ్లే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ మొదలు పెట్టింది. దేశంలోని ప్రధాన నగరాల మధ్య బుల్లెట్ ట్రైన్లను పరుగులు పెట్టించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో ప్రతిపాదిత ఢిల్లీ–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్?పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎందుకంటే ఢిల్లీ–అహ్మదాబాద్ బుల్లెట్ రైల్ సర్వీస్ మొదలైతే.. ఢిల్లీ, అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయం 14 గంటల నుంచి 3 నుంచి 4 గంటలకు గణనీయంగా తగ్గుతుంది.



ఢిల్లీ–అహ్మదాబాద్ బుల్లెట్ రైల్ ప్రాజెక్ట్ రాజస్థాన్?కు కూడా గేమ్ ఛేంజర్?గా మారనుంది. ఈ బుల్లెట్ రైలు రాజస్థాన్‌లోని ఏడు జిల్లాల గుండా మొత్తం 657 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తోంది. ఎంపిక చేసిన తొమ్మిది స్టేషన్లలో ఆగుతోంది. జైపూర్, అజ్మీర్, బెహ్రోర్, షాజహాన్‌పూర్, విజయనగర్, భిల్వారా, చిత్తోర్‌గఢ్, ఉదయపూర్, ఖేర్వాడ (దుంగర్‌పూర్ సమీపంలో) వంటి ప్రముఖ ప్రదేశాల్లో హాల్టింగ్ తీసుకుంటుంది. ఈ రైలు గంటకు 350 కి.మీ. వేగంతో ప్రయాణించగలదని అంచనా.

ఢిల్లీ–అహ్మదాబాద్ బుల్లెట్ రైల్ అనేక సొరంగాలు, కొండ ప్రాంతాలు, వంతెనల గుండా ప్రయాణిస్తూ ప్రయాణికులకు కొత్త అనుభూతి అందించనుంది. ఈ రైల్ దేశంలోని ఐదు ప్రధాన నదులను దాటుతుంది. ఈ హై–స్పీడ్ రైలు రాజస్థాన్‌లోని ఏడు జిల్లాల్లోని 335 గ్రామాల గుండా దూసుకెళ్తోంది. ఇది ప్రయాణికులకు రాష్ట్ర వారసత్వం గురించి తెలుసుకునేందుకు దోహదపడుతోంది. జైపూర్, ఉదయపూర్ వంటి వారసత్వ సంపద కలిగిన పర్యాటక ప్రదేశాలను ఈ రైల్ ప్రయాణంలో భాగంగా ప్రయాణికులు చూడవచ్చు. ఈ బుల్లెట్ రైలు త్వరలోనే పట్టాలు ఎక్కనుంది.

# మొత్తం ఆర్సీబీ యాజమాన్యం వల్లే.. పోలీసులు ఏం దేవుళ్లు కాదు: తొక్కిసలాటపై క్యాట్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్సీబీ విక్టరీ పరేడ్ సందర్భంగా బెంగుళూరులో జరిగిన తొక్కిసలాట ఘటనపై సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కీలక వ్యాఖ్యలు చేసింది. తొక్కిసలాటకు ప్రధాన కారణం ఆర్సీబీ యాజమాన్యమేనని.. దీనికి వాళ్లే బాధ్యత వహించాలని పేర్కొంది. ఐపీఎల్ 18 విజేతగా ఆర్సీబీ నిలవడంతో 2025, జూన్ 4న బెంగుళూరులో విక్టరీ పరేడ్?తో పాటు చినస్వామి స్టేడియంలో ఆటగాళ్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో స్టేడియం దగ్గర తొక్కిసలాట జరిగి 11 మంది అభిమానులు మృతి చెందగా.. మరికొందరు గాయపడ్డారు.

తొక్కిసలాటకు పోలీసుల నిర్లక్ష్యమే కారణమని కర్నాటక ప్రభుత్వం పలువురు పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటు వేసింది. సస్పెన్షన్?ను సవాల్ చేస్తూ ఓ పోలీస్ అధికారి క్యాట్?ను ఆశ్రయించాడు. ర్యాలీ ఏర్పాట్లకు పోలీసులకు




తగినంత సమయం ఇవ్వలేదని.. అందుకే తొక్కిసలాట జరిగిందని.. ఇందులో పోలీసుల తప్పేమి లేదని క్యాట్?లో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్?ను మంగళవారం (జూలై 1) విచారించిన క్యాట్.. విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది.

జూన్ 4న బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడిన ఘటనకు ఆర్సీబీ యజమాన్యం ప్రాథమికంగా బాధ్యత వహించాలని పేర్కొంది. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా మూడు నుంచి ఐదు లక్షల మందిని సమీకరించడానికి ఆర్సీబీ సోషల్ మీడియాలో పోస్ట్?లు పెట్టిందని.. ఈ పోస్టుల వల్లే అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారని చెప్పింది. చివరి నిమిషంలో విక్టరీ పరేడ్, సన్మాన కార్యక్రమం ప్రకటించడాన్ని క్యాట్ తప్పుబట్టింది.

ముందస్తు అనుమతి లేకుండా ఆకస్మాత్తుగా ఆర్సీబీ సెలబ్రేషన్స్ ప్రకటించడం ఇబ్బంది కల్గించిందని పేర్కొంది. కేవలం 12 గంటల తక్కువ సమయంలో పోలీసులు అన్ని ఏర్పాట్లను చేస్తారని ఆశించలేమంది. పోలీసులు కూడా మనుషులేనని.. వాళ్లేమి దేవుళ్లు లేదా ఇంద్రజాలికులు కాదని పోలీసులను సమర్థించింది. అల్లాదీన్ వంటి మాయా శక్తులు పోలీసులకు లేవని చురకలంటించింది. పోలీసులకు అవసరమైన సన్నాహాలు చేయడానికి తగినంత సమయం ఇవ్వలేదని.. ఇందులో పూర్తిగా పోలీసులు తప్పేమి లేదని ట్రిబ్యునల్ పేర్కొంది.

## పాశమైలారం ప్రమాదం.. సిగాచి యాజమాన్యంపై కేసు నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:** పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత కుటుంబానికి చెందిన యశ్వంత్ ఫిర్యాదు మేరకు పరిశ్రమ యాజమాన్యం సిగాచిపై బీడీఎల్ భానూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. 105, 110, 117 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో పలువురు మృతి చెందగా, మరికొంతమంది గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**ఉన్నతస్థాయి కమిటీ వేయాలి: కిషన్ రెడ్డి డిమాండ్**

బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుతో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాశమైలారం పారిశ్రామికవాడ ప్రమాద స్థలాన్ని సందర్శించి, సహాయక చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటివరకు పలు మృతదేహాలను వెలికితీశారని, మరో 11 మంది ఆచూకీ తెలియాల్సి ఉందని తెలిపారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని, శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు ముమ్మరంగా సాగుతోందని వివరించారు. పొట్టకూటి కోసం వలస వచ్చి ఇలా ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన అన్నారు.

భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం వెంటనే ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కిషన్ రెడ్డి సూచించారు. రాష్ట్రంలోని పరిశ్రమల్లో జరుగుతున్న తనిఖీలు కేవలం లంచాల కోసమా లేక నామమాత్రంగా సాగుతున్నాయా అనే అనుమానం కలుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఫార్మా కంపెనీలకు ముడిసరుకు అందించే ఈ సంస్థలో భద్రతా ప్రమాణాల లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గతంలోనూ ఇలాంటి ప్రమాదంలో 11 మంది చనిపోయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత వహించాల్సిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సిగాచి యాజమాన్యానికి చెందిన మరో మూడు పరిశ్రమలు కూడా ఉన్నాయని, వాటిలోనూ తక్షణమే తనిఖీలు నిర్వహించి భద్రతా ప్రమాణాలను సమీక్షించాలని కోరారు. శిథిలాల కింద ఇంకా మృతదేహాలు ఉండే అవకాశం ఉన్నందున, వాటిని గుర్తించేందుకు పోలీస్ జాగిలాలను వినియోగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పారిశ్రామిక ప్రాంతాల్లో తప్పనిసరిగా అంబులెన్స్ అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తరపున రాష్ట్రానికి అన్ని విధాలా సహకారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి వివరాలు తెలిసిన తర్వాత, వారి కుటుంబ సభ్యులకు తమ పార్టీ అండగా నిలుస్తుందని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. మృతుల కుటుంబసభ్యులు తమ సొంత రాష్ట్రాలకు వెళ్లాలనుకుంటే, అందుకు అవసరమైన సహాయాన్ని అందిస్తామన్నారు. ఈ ఘటనపై రాజకీయాలు చేయడం సరికాదని విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

## పటాన్‌చెరు మార్చురీ వద్ద 11 మృతదేహాల అప్పగింత



**హైదరాబాద్ పెన్ పవర్:** పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో పాశమైలారంలో జరిగిన ఘోర అగ్నిప్రమాద ఘటనలో విషాదం కొనసాగుతోంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద ఈరోజు హృదయాలను ద్రవింపజేసే దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. తమ వారిని కోల్పోయిన కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా కన్నీటి సంద్రంగా మారింది. ఏ మృతదేహం ఎవరిదో తెలియని అయోమయ స్థితిలో బంధువులు మార్చురీ వద్ద పడిగాపులు కాస్తున్నారు.ప్రమాద తీవ్రతకు మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా మారిపోవడంతో, వాటిని గుర్తించడం అధికారులకు పెను సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతులను గుర్తించే ప్రక్రియను వైద్య శాఖ అధికారులు చేపట్టారు. డీఎన్ఏ నివేదికలు అందిన తర్వాతనే, నిర్ధారించుకుని మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. ఈ ప్రక్రియ ఆలస్యం అవుతుండటంతో కుటుంబ సభ్యుల ఆవేదన మరింత పెరుగుతోంది.ఇదిలా ఉండగా, ఇప్పటివరకు గుర్తించిన 11 మంది మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం ఈ 11 మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు నలుగురు, తెలంగాణకు చెందిన వారు ఒకరు, ఒడిశా నుంచి ముగ్గురు, బీహార్ నుంచి ఇద్దరు, ఉత్తరప్రదేశ్ నుంచి ఒకరు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# అహ్మదాబాద్ దుర్ఘటన తర్వాత రెండు రోజులకే.. అకస్మాత్తుగా 900 అడుగుల కిందకు వచ్చిన మరో విమానం!

- అహ్మదాబాద్ దుర్ఘటన జరిగిన రెండు రోజుల్లోనే ఈ ఘటన
- గాల్లో 900 అడుగులు కిందకు జారిపోయిన ఢిల్లీ-వియన్నా విమానం
- ఘటనపై రంగంలోకి దిగిన డీజీసీఏ దర్యాప్తు
- ఇద్దరు పైలట్లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగింపు
- దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో భద్రతా లోపాలున్నాయని గుర్తింపు



**హైదరాబాద్ పెన్ పవర్:**అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాద విషాదం నుంచి దేశం ఇంకా తేరుకోకముందే ఎయిరిండియాకు చెందిన మరో విమానం పెను ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. ఢిల్లీ నుంచి వియన్నా వెళ్తున్న విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే గాల్లో ఒక్కసారిగా 900 అడుగుల కిందకు రావడంతో ప్రయాణికులు భయంతో వణికిపోయారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

**ఏం జరిగిందంటే?**

జూన్ 14న ఢిల్లీ నుంచి వియన్నాకు బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ 777 విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రతికూల వాతావరణం కారణంగా విమానం అకస్మాత్తుగా భూమివైపు దూసుకెళ్లింది. 900 అడుగుల మేర కిందకి దిగడంతో వెంటనే ప్రమాద హెచ్చరిక సిగ్నల్స్ మోగాయి. అప్రమత్తమైన పైలట్లు వెంటనే విమానాన్ని తమ నియంత్రణలోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికి అహ్మదాబాద్ దుర్ఘటన జరిగి రెండు రోజులు మాత్రమే అయింది. ఈ ఘటనతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

**రంగంలోకి డీజీసీఏ**

ఈ ఘటనను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తీవ్రంగా పరిగణించింది. తక్షణమే విచారణకు ఆదేశించడమే కాకుండా, ఆ విమానాన్ని నడిపిన ఇద్దరు పైలట్లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ జూన్ 17న ఎయిరిండియా భద్రతా విభాగాధిపతికి డీజీసీఏ సమన్లు జారీ చేసింది.

**వరుస ఘటనల నేపథ్యంలో విస్తృత తనిఖీలు**

జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 242 మంది ప్రయాణికులకు గాను 241 మంది దుర్మరణం చెందగా, ఒకే ఒక్కరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ విమానం ఒక మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడటంతో అక్కడ కూడా పలువురు మృతి చెందారు. ఈ వరుస ఘటనల నేపథ్యంలో దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో డీజీసీఏ ఇటీవల విస్తృత తనిఖీలు చేపట్టింది.

ఈ తనిఖీల్లో విమానయాన భద్రతా వ్యవస్థల్లో పలు తీవ్రమైన లోపాలు ఉన్నట్లు గుర్తించింది. ఒక విమానాశ్రయంలో అరిగిపోయిన టైర్లతో ఒక విమానం నిలిచిపోయినట్లు, మరికొన్ని విమానాల్లో ఒకేరకమైన సాంకేతిక సమస్యలు పదేపదే తలెత్తినట్లు డీజీసీఏ తన నివేదికలో పేర్కొంది.

ఒక చోట పైలట్లకు శిక్షణ ఇచ్చే సిమ్యులేటర్ సాఫ్ట్‌వేర్ కూడా అప్‌డేట్ చేయలేదని, అది ప్రస్తుత విమానం కాన్ఫిగరేషన్‌తో సరిపోలడం లేదని వెల్లడించింది. పర్యవేక్షణ, సమస్యల పరిష్కారంలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఈ అంశాలు స్పష్టం చేస్తున్నట్లు డీజీసీఏ అభిప్రాయపడింది.

# జగన్, వైసీపీ డ్రామాలను యువత గమనించాలి: సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి

- గత ఐదేళ్లలో ఉద్యోగాల్లేక 2,400 మంది నిరుద్యోగుల ఆత్మహత్య
- యువతను రెచ్చగొట్టేందుకు వైసీపీ శ్రేణులు కుట్రలు చేస్తున్నాయని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక 9 లక్షల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు
- డీఎస్సీ, పోలీసు నియామకాలతో పాటు భారీగా ప్రైవేటు ఉద్యోగాల కల్పన
- నైపుణ్యాభివృద్ధి కోసం రూ. 1,210 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- యువత భవిష్యత్‌పై దృష్టి పెట్టాలి, వైసీపీ ప్రచారాలను నమ్మొద్దు అని సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:**గత ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో పరిశ్రమలు రాకపోగా, ఉన్నవి కూడా తరలిపోవడంతో తీవ్రమైన నిరుద్యోగ సమస్య తలెత్తిందని, దాని ఫలితంగా సుమారు 2,400 మంది యువత ఆత్మహత్య చేసుకున్నారని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (%ూజుజుణూూ%) ఛైర్మన్ దీపక్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం యువతకు మేలు చేస్తుంటే ఓర్వలేక వైసీపీ నాయకులు వారిని రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. వైసీపీ మూకల అసత్య ప్రచారాలు నమ్మి జీవితాలను నాశనం చేసుకోవద్దని, యువత భవిష్యత్‌కు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

**జగన్ పాలనలో యువతకు తీరని ద్రోహం**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని దీపక్ రెడ్డి విమర్శించారు. "ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి జగన్ నిరుద్యోగులను నిలువునా ముంచారు. ఆయన పాలనలో లక్షా 80 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రాన్ని వీడిపోయాయి. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీలతో పాటు చివరకు ఒక అండర్‌వేర్ కంపెనీని కూడా తరిమికొట్టారు. జగన్ ఒక ఆర్థిక ఉగ్రవాది అని వెళ్లిపోయిన కంపెనీలే అంటున్నాయి" అని ఆయన ఆరోపించారు. కేంద్రం చెప్పినా వినకుండా విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసి, దాదాపు రూ. 12,250 కోట్లు వినియోగించుకోకుండానే సంస్థలకు చెల్లించారని గుర్తు చేశారు. పోలవరం పనులు ఆపడం వల్ల రాష్ట్రానికి సుమారు రూ. 2 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని, ఈ మొత్తం గత ఐదేళ్లలో జగన్ డీబీటీ ద్వారా ఇచ్చిన దానికి సమానమని అన్నారు.

**కూటమి పాలనలో ఉద్యోగాల వెల్లువ**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యువత భవిష్యత్‌పై దృష్టి సారించిందని దీపక్ రెడ్డి తెలిపారు. "ఇప్పటికే దాదాపు 9 లక్షల కోట్ల పెట్టుబడులపై పలు కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. కొన్ని సంస్థలు పనులు కూడా ప్రారంభించాయి. డీఎస్సీ ద్వారా 16,346 ఉపాధ్యాయ పోస్టులు, 6,100 పోలీసు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాం. సీడాప్, ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా ఇప్పటివరకు 82,736 మందికి ఉద్యోగాలు కల్పించాం. మరో రెండు నెలల్లో శిక్షణ పొందుతున్న 30 వేల మందికి కూడా ఉద్యోగాలు వస్తాయి" అని ఆయన వివరించారు. ఇన్ఫోసిస్‌తో ఒప్పందం చేసుకొని 2 లక్షల మంది యువతను విదేశాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

**నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట**

యువతలో నైపుణ్యాలు పెంచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దీపక్ రెడ్డి అన్నారు. "2024-25 సంవత్సరానికి నైపుణ్యాభివృద్ధి కోసం రూ. 1,210 కోట్లు కేటాయించాం. లెర్నింగ్, స్కిల్లింగ్, జాబ్స్ అన్నీ ఒకేచోట ఉండేలా 'నైపుణ్యం' అనే కొత్త పోర్టల్‌ను త్వరలో ప్రారంభించబోతున్నాం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 100 స్కిల్ సెంటర్లు, 485 కళాశాలల్లో ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్లు నడుస్తున్నాయి. కియా, హ్యుందాయ్ వంటి 162 పెద్ద కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని విద్యార్థులకు ఇండస్ట్రీలో శిక్షణ ఇప్పిస్తున్నాం" అని ఆయన తెలిపారు.

గతంలో టీడీపీ ఇచ్చిన 6 లక్షల యువనేస్తం పథకాన్ని వైసీపీ ఎగ్గొట్టిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను మోసం చేసిందని దీపక్ రెడ్డి ఆరోపించారు. విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరు తొలగించి, ఆ పథకాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏపీపీఎస్సీని భ్రష్టు పట్టించి అర్హులకు అన్యాయం చేశారని, రాష్ట్రాన్ని గంజాయి, మద్యంతో నింపారని మండిపడ్డారు. యువత ప్రభుత్వ అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని, వైసీపీ నేతల మాటలు నమ్మి కేసులపాలు కావద్దని ఆయన హితవు పలికారు.

# బనకచర్లకు బ్రేక్ పడలే.. జస్ట్ కామా మాత్రమే.. బీజేపీపై పోరాటం ఉధృతం చేయాలి: సీఎం రేవంత్





హైదరాబాద్ పెన్ పవర్: బనకచర్ల ప్రాజెక్ట్?కు కేంద్రం అనుమతుల తిరస్కరణ తాత్కాలికమేనని.. పునఃపరిశీలన తర్వాతైనా బనకచర్ల ప్రాజెక్ట్ మళ్లీ తెరమీదకు వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్?పై మంగళవారం (జూలై 1) ప్రజాభవన్?లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సంబంధిత అధికారులు ఈ పీపీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కేంద్రంలోని ప్రధాని మోదీ సర్కార్ మనుగడ చంద్రబాబు మీద ఆధారపడి ఉందని.. చంద్రబాబు మనుగడ గోదావరి జలాల మీద ఆధారపడి ఉందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 11 ఏళ్లుగా తెలంగాణను కేంద్రంలోని బీజేపీ నిర్లక్ష్యంగా చేస్తోందని.. రాష్ట్రానికి అన్యాయం చేస్తోన్న బీజేపీపై పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ చచ్చిన బీఆర్ఎస్?ను బతికించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్ర హక్కులను కాలరాసేందుకే బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇచ్చామా అని ప్రశ్నించారు. ఏపీ నుంచి కేంద్రంలో ఉన్న మంత్రులు వాళ్ల రాష్ట్ర కోసం ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ నుంచి ఉన్న కేంద్ర మంత్రులు మాత్రం రాష్ట్రం కోసం ఎలాంటి ప్రయత్నం చేయట్లేదని విమర్శించారు. తెలంగాణ నీటి కేటాయింపు గురించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారానికి కిషన్ రెడ్డి ఎందుకు ప్రయత్నించడం లేదని నిలదీశారు. కేసీఆర్ కోసమే కిషన్ రెడ్డి పని చేస్తున్నారని, ఆయన మాట్లాడే ప్రతిమాట కేసీఆర్ దగ్గరి నుంచే వస్తుందని ఆరోపించారు. నీటి పంపకాల గురించి చర్చించేందుకు మేం వస్తున్నామంటే ఆయన ముందే వెళ్లి కేంద్ర మంత్రిని కలుస్తున్నారు.. కిషన్ రెడ్డి తీరు అనుమానాలకు తావు ఇస్తోందన్నారు. కేంద్రమంత్రులను కలిసేందుకు కిషన్ రెడ్డి మాతో కలిసి ఎందుకు రావడం లేదు.. మాకంటే ముందే వెళ్లి రహస్యంగా వెళ్లి చర్చించాల్సిన అవసరమేంటి అని ప్రశ్నించారు. గోదావరి వరద జలాలను తరలిస్తే తెలంగాణకు ఇబ్బందేంటని ఏపీ వాదిస్తోంది. మరీ నికర జలాల్లో మా వాటాపై ఏపీ ఎందుకు అభ్యంతరం చెప్తోందని నిలదీశారు. మూడో పంట కోసం ఏపీ ప్రయత్నిస్తోందని.. ఇక్కడ మాకు మొదటి పంటకే నీళ్లు లేవని అన్నారు. మా నీటి వాటాలపై ఏపీ కూడా సహకరించాలని కోరారు. కేసీఆర్ హయాంలో జరిగిన చర్చల మేరకే చంద్రబాబు ప్రాజెక్ట్ కడుతున్నారన్నారు. నికర జలాల్లో 968 టీఎంసీలు, ప్రాజెక్టులకు అనుమతుల కోసమే మా ప్రయత్నమని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య నికర జలాలు, మిగులు, వరద జలాల లెక్కలు తేల్చాలని కేంద్రాన్ని కోరతున్నాం.. అన్ని లెక్కలు తేలాకే వరద జలాల గురించి మాట్లాడాలని ఖరాకండిగా చెప్పారు.రొయ్యల పులుసు, రాగి సంకటితో మాకు పని లేదని.. నీళ్ల ప్రయోజనాలే మాకు ముఖ్యమని తేల్చి చెప్పారు.

# తెరుచుకున్న బాబ్లీ గేట్లు.. రైతులు, మత్స్యకారుల హర్షం

- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెరుచుకున్న బాబ్లీ గేట్లు
- గోదావరి నదిలోకి నీటి ప్రవాహాన్ని ప్రారంభించిన అధికారులు
- మొత్తం 14 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల
- అక్టోబర్ 28 వరకు తెరిచే ఉండనున్న ప్రాజెక్టు గేట్లు



హైదరాబాద్ పెన్ పవర్:మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య కీలకమైన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మంగళవారం అధికారులు ఎత్తారు. సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను అనుసరించి, ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా జులై 1న గేట్లను తెరిచారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ సమీపంలో గోదావరి నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టుకు ఉన్న 14 గేట్లను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అధికారుల పర్యవేక్షణలో ఇరు రాష్ట్రాల ఇంజనీర్లు పైకి లేపారు. దీంతో గోదావరి నదిలోకి నీటి ప్రవాహం మొదలైంది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం ఏటా జులై 1 నుంచి అక్టోబర్ 28 వరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను పూర్తిగా తెరిచి ఉంచాల్సి ఉంటుంది. ఈ కాలంలో ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయకుండా, గోదావరి నది సహజ ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలి. ఈ నిబంధనను అనుసరిస్తూ మంగళవారం ఉదయం అధికారులు గేట్లను ఎత్తారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 1,064 అడుగుల వద్ద ఉందని అధికారులు వెల్లడించారు.

బాబ్లీ గేట్లు తెరుచుకోవడంతో దిగువన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులతో పాటు గోదావరి నదిపై ఆధారపడి జీవించే మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరు నేరుగా దిగువకు చేరనుండటంతో తమకు ప్రయోజనం కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో అధికారులు గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. బాబ్లీ నుంచి నీటి

విడుదల ప్రారంభమైనందున నదిలో నీటి ప్రవాహం క్రమంగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల నది తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు, పశువుల కాపరులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## మనిషి ఆయుష్షు 200 ఏళ్లు.. బాబా రాందేవ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ పెన్ పవర్: ప్రముఖ నటి షెఫాలీ జరీవాలా అకాల మరణం తర్వాత యాంటీ ఏజింగ్ మందుల వాడకంపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో యోగా గురు బాబా రాందేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మనిషి సహజ ఆయుష్షు వందేళ్లు కాదని, సరైన జీవనశైలిని పాటిస్తే 150 నుంచి 200 ఏళ్ల వరకు జీవించవచ్చని ఆయన అన్నారు.షెఫాలీ జరీవాలా మృతిపై రాందేవ్ బాబా ఈరోజు ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిపై ఆందోళన వ్యక్తం చేశారు. "మానవ శరీరం ఒక అద్భుతం. కానీ మన మెదడు, గుండె, కాలేయంపై మనమే ఎక్కువ భారం మోపుతున్నాం. 100 ఏళ్లలో తినాల్సిన ఆహారాన్ని 25 ఏళ్లకే తినేస్తున్నాం" అని ఆయన అభిప్రాయపడ్డారు. తనకు 60 ఏళ్లు దాటినా యోగా, ఆహార నియమాలు, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి వల్లే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు.గతంలో నటుడు సిద్ధార్థ్ శుక్లా, ఇప్పుడు షెఫాలీ జరీవాలా లాంటి యువతరం అకాల మరణాలపై స్పందిస్తూ, "వారి హార్డ్‌వేర్ బాగున్నా, సాఫ్ట్‌వేర్ లోపభూయిష్టంగా ఉంది. పైకి కనిపించే లక్షణాలు బాగానే ఉన్నా, శరీర వ్యవస్థ దెబ్బతింది" అని ఆయన వ్యాఖ్యానించారు. పైపై మెరుగుల కన్నా అంతర్గత ఆరోగ్యం చాలా ముఖ్యమని ఆయన సూచించారు.మరోవైపు, షెఫాలీ మృతి కేసులో పోలీసుల దర్యాప్తు కీలక విషయాలను వెల్లడించింది. ముంబైలోని ఆమె నివాసంలో పోలీసులు రెండు పెట్టెల నిండా మందులను గుర్తించారు. వాటిలో చర్మ సౌందర్యం కోసం వాడే గ్లూటాథియోన్, విటమిన్ సి ఇంజెక్షన్లు, ఎసిడిటీ మాత్రలు ఉన్నట్లు తేలింది. ఆమె గత ఏడెనిమిదేళ్లుగా వైద్యుల పర్యవేక్షణ లేకుండా సొంతంగానే ఈ యాంటీ ఏజింగ్ చికిత్సలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. శరీరంలోని ప్రతి కణం సహజ జీవిత చక్రాన్ని దెబ్బతీసినప్పుడు గుండెపోటు వంటి ప్రమాదాలు జరుగుతాయని రాందేవ్ హెచ్చరించారు.

## భారత్‌కు వెల్లువెత్తిన ప్రవాసీల పంపకాలు.. రెమిటెన్స్‌లలో ప్రపంచంలోనే టాప్!

హైదరాబాద్ పెన్ పవర్:విదేశాల్లో స్థిరపడిన భారతీయులు తమ కష్టార్జితాన్ని దేశానికి పంపడంలో సరికొత్త రికార్డు సృష్టించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశానికి అందిన విదేశీ చెల్లింపులు (రెమిటెన్స్‌లు) ఏకంగా 135.46 బిలియన్ డాలర్లకు చేరాయి. గతేడాదితో పోలిస్తే ఇది 14 శాతం అధికమని ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్**

విదేశాల నుంచి సొమ్మును స్వీకరించడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచ బ్యాంకు ఆర్థికవేత్తలు రూపొందించిన నివేదిక ప్రకారం, 2024 క్యాలెండర్ ఇయర్‌లో భారత్‌కు 129.4 బిలియన్ డాలర్ల చెల్లింపులు అందాయి. ఈ జాబితాలో 68 బిలియన్ డాలర్లతో మెక్సికో రెండో స్థానంలో, 48 బిలియన్ డాలర్లతో చైనా మూడో స్థానంలో ఉన్నాయి. ఫిలిప్పీన్స్ (40 బిలియన్ డాలర్లు), పాకిస్థాన్ (33 బిలియన్ డాలర్లు) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 2023లో కేవలం 1.2 శాతంగా ఉన్న రెమిటెన్స్‌ల వృద్ధి రేటు 2024లో ఏకంగా 5.8 శాతానికి పెరగడం గమనార్హం.

**పెరుగుదలకు కారణాలివే..**

ఈ భారీ పెరుగుదలకు అనేక అంశాలు దోహదం చేశాయి. ముఖ్యంగా కరోనా మహమ్మారి తర్వాత అమెరికా సహా ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) దేశాల్లో ఉద్యోగ మార్కెట్లు తిరిగి పుంజుకోవడం ప్రధాన కారణంగా నిలిచింది. ముఖ్యంగా అమెరికాలో విదేశీ ఉద్యోగుల నియామకాలు కరోనాకు ముందున్న స్థాయి కంటే 11 శాతం పెరిగాయి. దీనికి తోడు విదేశాలకు వలస వెళ్లే భారతీయుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 1990లో 66 లక్షలుగా ఉన్న ప్రవాస భారతీయుల సంఖ్య, 2024 నాటికి 1.85 కోట్లకు చేరింది. వీరిలో దాదాపు సగం మంది గల్ఫ్ దేశాల్లోనే పనిచేస్తున్నారు.

# టీ, కాఫీలకు బదులు గులాబీ టీ... ఆరోగ్యానికి ఎంతో మేలు!

- మలబద్ధకం, అజీర్తి సమస్యలకు చక్కటి పరిష్కారం
- విటమిన్ సి పుష్కలం.. రోగనిరోధక శక్తి పెంపు
- శరీర నొప్పులు, వాపులను తగ్గించే ప్రత్యేక గుణాలు
- మహిళల్లో రుతుక్రమ సమస్యలకు మంచి ఉపశమనం
- ఒత్తిడి, ఆందోళన తగ్గించి ప్రశాంతమైన నిద్రకు సహకారం



హైదరాబాద్ పెన్ పవర్:చాలా మందికి ఉదయం నిద్ర లేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. ఈ అలవాటు రోజులో చాలాసార్లు కొనసాగుతుంది. అయితే, వీటిలో ఉండే కెఫీన్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కెఫీన్ లేని ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా 'గులాబీ టీ' (రోజ్ టీ) మంచి ఎంపిక అని ఆయుర్వేద వైద్యులు సూచిస్తున్నారు. ఎండబెట్టిన గులాబీ రేకులతో తయారుచేసే ఈ టీని రోజుకు రెండు కప్పులు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని వారు చెబుతున్నారు.

**జీర్ణవ్యవస్థకు మేలు.. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం**

ఎండబెట్టిన గులాబీ రేకులతో చేసే ఈ టీలో పాలీఫినాల్స్, ఆంథోసైనిన్స్ వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావాన్ని తగ్గించి, కణజాలాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. దీనివల్ల గుండె జబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పు తగ్గుతుందని నిపుణులు అంటున్నారు. అలాగే రోజ్ టీ సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. దీనివల్ల మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. కాలేయంలోని వ్యర్థాలను బయటకు పంపడంలోనూ ఇది సహాయపడుతుంది.

**రోగనిరోధక శక్తి.. నొప్పుల నివారణ**

గులాబీ రేకుల్లో విటమిన్ సి అధిక మోతాదులో ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పటిష్ఠం చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఫలితంగా జలుబు, దగ్గు వంటి సాధారణ ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా శరీరాన్ని కాపాడుకోవచ్చు. ఈ టీలో ఉండే యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలు శరీరంలోని నొప్పులు, వాపులను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా కీళ్ల నొప్పులతో బాధపడేవారికి (ఆర్థరైటిస్) ఇది కొంత ఉపశమనం కలిగిస్తుంది. గొంతు నొప్పి, గరగర వంటి సమస్యలకు కూడా ఇది మంచి మందుగా పనిచేస్తుంది.

**మహిళల ఆరోగ్యం.. మానసిక ప్రశాంతత**

మహిళలు ఎదుర్కొనే రుతుక్రమ సమస్యలకు గులాబీ టీ చక్కటి పరిష్కారం చూపుతుంది. రుతుస్రావ సమయంలో వచ్చే కడుపు నొప్పిని తగ్గించడంలో దీనిలోని యాంటీ-స్పాస్మోడిక్ గుణాలు సహాయపడతాయి. క్రమం తప్పకుండా ఈ టీ తాగడం వల్ల రుతుచక్రం కూడా సక్రమంగా ఉండేందుకు దోహదపడుతుందని చెబుతున్నారు. ఇక గులాబీ పువ్వుల సహజసిద్ధమైన సువాసన మనసుపై సానుకూల ప్రభావం చూపుతుంది. ఈ టీ తాగడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రిళ్లు నిద్రలేమితో బాధపడేవారికి ఇది హాయిగా నిద్రపట్టేందుకు కూడా సహకరిస్తుంది.

# సబ్సిడీలు లేకపోతే మస్క్ దక్షిణాఫ్రికాకే.. ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు

- ట్రంప్, మస్క్ మధ్య తీవ్రమైన మాటల యుద్ధం
- ప్రభుత్వ సబ్సిడీలతోనే మస్క్ వ్యాపారం చేస్తున్నారంటూ ట్రంప్ విమర్శ
- వివాదాస్పద బిల్లు పాసైతే కొత్త పార్టీ పెడతానని మస్క్ హెచ్చరిక
- ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను రాయితీ రద్దు అంశమే వివాదానికి మూలం
- సబ్సిడీలు ఆపితే మస్క్ దక్షిణాఫ్రికా వెళ్లాల్సిందేనని ట్రంప్ ఘాటు వ్యాఖ్య





హైదరాబాద్ పెన్ పవర్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ప్రభుత్వం ప్రతిపాదించిన ఓ కీలకమైన పన్నుల బిల్లు విషయంలో ఇరువురి మధ్య మాటల యుద్ధం తీవ్రమైంది. చరిత్రలోనే ఏ వ్యక్తికి దక్కనంత స్థాయిలో మస్క్ ప్రభుత్వ సబ్సిడీలు పొందారని, అవి లేకపోతే ఆయన తన వ్యాపారాన్ని మూసివేసి దక్షిణాఫ్రికాకు తిరిగి వెళ్లాల్సి వస్తుందని ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఈ బిల్లును ఆమోదిస్తే తాను కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని ఎలాన్ మస్క్ హెచ్చరించడంతో అమెరికా రాజకీయాల్లో ఈ వివాదం పెను దుమారం రేపుతోంది.

**మస్క్‌పై విరుచుకుపడ్డ ట్రంప్**

ట్రంప్ ప్రతిపాదించిన 'బిగ్ బ్యూటిఫుల్ బిల్'పై మస్క్ తన విమర్శలను తీవ్రతరం చేయడంతో అధ్యక్షుడు ఘాటుగా స్పందించారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ స్పందిస్తూ... "చరిత్రలో ఏ వ్యక్తికి దక్కనంత స్థాయిలో ఎలాన్ మస్క్ సబ్సిడీలు పొంది ఉండవచ్చు. ఆ సబ్సిడీలు లేకపోతే, బహుశా ఎలాన్ తన దుకాణాన్ని మూసివేసి దక్షిణాఫ్రికాలోని తన ఇంటికి తిరిగి వెళ్లవలసి ఉంటుంది. ఇక రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాలు లేదా ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తి ఉండదు. దీనివల్ల మన దేశానికి భారీగా డబ్బు ఆదా అవుతుంది. బహుశా మస్క్ ప్రభుత్వ సబ్సిడీలు, కాంట్రాక్టులపై డోజ్ నిశితంగా దృష్టి పెట్టాలేమో? దీనివల్ల పెద్ద మొత్తంలో డబ్బు ఆదా చేయవచ్చు!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

**వివాదానికి కారణమైన ఈవీ రాయితీ**

ట్రంప్, మస్క్‌ల మధ్య వివాదానికి ప్రధాన కారణం ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) కొనుగోలుపై ప్రస్తుతం ఉన్న 7,500 డాలర్ల పన్ను రాయితీని ఈ బిల్లు రద్దు చేస్తుందనే ఆందోళనలే. ఈ రాయితీని తొలగిస్తే ఎలక్ట్రిక్ కార్ల ధరలు గణనీయంగా పెరుగుతాయి. ఇది టెస్లా వంటి కంపెనీలకు పెద్ద దెబ్బ. ఈ నేపథ్యంలోనే మస్క్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే, తాను ఎప్పటినుంచో ఎలక్ట్రిక్ వాహనాల తప్పనిసరి నిబంధనకు వ్యతిరేకమని ట్రంప్ స్పష్టం చేశారు. "ఇది ఒక పనికిమాలిన నిబంధన. నా ఎన్నికల ప్రచారంలోనూ దీని గురించి నేను స్పష్టంగా చెప్పాను. ఎలక్ట్రిక్ కార్లు మంచివే, కానీ అందరూ వాటినే కొనాలని బలవంతం చేయకూడదు" అని ట్రంప్ వివరించారు.

**కొత్త పార్టీ పెడతానన్న మస్క్**

ఒకప్పుడు ట్రంప్‌కు సన్నిహితుడిగా ఉన్న మస్క్, గత నెల రోజులుగా ఈ 4 ట్రిలియన్ డాలర్ల పన్నుల బిల్లు విషయంలో అధ్యక్షుడితో విభేదిస్తున్నారు. సోమవారం ఆయన తన విమర్శల తీవ్రతను పెంచుతూ, ఈ బిల్లు సెనేట్‌లో ఆమోదం పొందితే 'అమెరికా పార్టీ' పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తానని హెచ్చరించారు. ఈ బిల్లు వల్ల దేశ జాతీయ అప్పు 3 ట్రిలియన్ డాలర్లకు పైగా పెరుగుతుందని, ఇది దేశాన్ని దివాలా తీయిస్తుందని ఆయన ఆరోపించారు. దీనిని 'రుణ బానిసత్వ బిల్లు' అని అభివర్ణిస్తూ, "ఈ బిల్లు వల్ల దేశం అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. మనది ఇప్పుడు ఒకే పార్టీ దేశంలా మారింది. అదే 'పోర్కీ పిగ్ పార్టీ'!! ఇప్పుడు ప్రజల గురించి నిజంగా పట్టించుకునే కొత్త పార్టీ రావాల్సిన సమయం వచ్చింది" అని మస్క్ ట్వీట్ చేశారు.